ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

హైదరాబాద్ నగర వార్తలు

3

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 కనిష్ఠం 19.8



జీహెచ్ఎంసీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం అమలులో లోపాలున్నట్టు కాగ్ పేర్కొంది. ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, ఆర్థిక నిర్వహణపై అభ్యంతరం తెలిపింది. పూర్తయిన ఇళ్లను సంవత్సరాల తరబడి నిరుపయోగంగా ఉంచడం వల్ల రూ.3,983.68 కోట్ల నిధులు వృథా అయినట్టేనని అభిప్రాయపడింది. పథకం కోసం రుణం తీసుకొని కొన్నాళ్లపాటు వినియోగించకపోవడం వల్ల అనవసరంగా వడ్డీ భారం పెరిగిందని వెల్లడించింది.

డబుల్ లోపాలు

- నిర్మాణం, ఆర్థిక నిర్వహణపై కాగ్ అభ్యంతరాలు
- అంచనా వ్యయం పెంపుపైనా..
- ఖాళీగా ఉంచడంతో రూ.3,983 కోట్లు వృథా
- లబ్ధిదారుల ఎంపికపైనా అనుమానాలు
- పూర్తి వివరాలు లేకుండానే ఇళ్ల కేటాయింపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిధుల వినియోగం, ఇతర పథకాలు, విభాగాలకు మళ్లించడంపై జీహెచ్ఎంసీకి కాగ్ అక్షింతలు వేసింది. లక్ష ఇళ్లకు రూ.8,115 కోట్ల నిధులు అవసరమని అంచనా వేయగా.. ఆ మొత్తం అనూహ్యంగా పెరిగిందని కాగ్ తేల్చింది. ఇసుక, ఇతర సామగ్రి ధర పెరిగిందన్న కారణంతో అంచనావ్యయాన్ని రూ.9,800 కోట్లకుపైగా పెంచారు. ప్రైస్ ఎస్కలేషన్‌కు అవకాశం లేకున్నా రెండు, మూడు పర్యాయాలు అప్పటి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడం గమనార్హం. సర్కారు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్లే నిర్మాణ వ్యయం పెరిగిందని నివేదికలో పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తికాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద రెండో విడత నిధులు నిలిచిపోయాయి.

ఖాళీగా ఉంచడం వల్ల.. రూ.3,983 కోట్లు వృథా

గ్రేటర్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ఆమోదం ఉండగా, మార్చి 2021 నాటికి 48,178 ఇళ్లు మాత్రమే పూర్తయినట్టు గుర్తించారు. మరో 45,735 ఇళ్లు పురోగతిలో ఉండగా, 6,087 ఇళ్ల పనులు పలు కారణాలతో ప్రారంభం కాలేదు. 2015లో పథకం ప్రారంభం కాగా, 2020-21 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి కేవలం 50 శాతంలోపు ఇళ్లు పూర్తి చేశారు. అప్పటికి పూర్తయిన (మార్చి, 2021 నాటికి) ఇళ్లలో 96 శాతం (46,442) ఆరు నుంచి 36 నెలలపాటు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. దీంతో రూ.3,983.68 కోట్ల వ్యయం వృథా అని కాగ్ పేర్కొంది. జీహెచ్ఎంసీ పరిధిలో 103 ప్రాజెక్టుల్లో 28 ప్రాజెక్టులను కాగ్ పరిశీలించింది. ఇందులో ఇన్‌సిటు (అప్పటికే ఉన్న స్థలంలోని చిన్నఇళ్లను కూల్చి డబుల్ ఇళ్ల నిర్మాణం) ప్రాజెక్టులు 9 (2585 ఇళ్లు) కాగా.. ఇతర ప్రాంతాల్లో ప్రాజెక్టులు 19 (47748) ఉన్నాయి.

లబ్ధిదారుల ఎంపికలోనూ..

లబ్ధిదారుల ఎంపికలోనూ లోపాలున్నట్టు కాగ్ గుర్తించింది. జియాగూడ, ఎరుకల నాంచారమ్మ బస్తీల్లో ఇళ్ల కేటాయింపును కేస్‌స్టడీలుగా పేర్కొంది. జియాగూడలో 840 ఇళ్లు నిర్మించగా, ఇన్‌సిటు కేటగిరీలో 568 మంది లబ్ధిదారులకు కేటాయించారు. వీరిలో 17 మందికి సంబంధించిన ఆధార్, రేషన్‌కార్డు, పట్టా తదితర వివరాలు లేవని గుర్తించారు. ఈ నేపథ్యంలో వారికి కేటాయింపులపై అనుమానం వ్యక్తం చేశారు. అంతకుముందు స్లమ్ క్లియరెన్స్ కార్యక్రమంలో భాగంగా కేటాయించిన ఇళ్లను అసలు యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు విక్రయించారని, వారికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఎరుకల నాంచారమ్మ బస్తీలో 288 ఇళ్లు నిర్మించగా.. రెవెన్యూ విభాగం సర్వే నిర్వహించి 165 మంది ఇన్‌సిటు లబ్ధిదారులతో జాబితా సిద్ధం చేసింది. వాస్తవంగా 136 గుడిసెలు ఉన్నప్పటికీ.. కొందరికి మేజర్లు అయిన పిల్లలుండడం వారికి పెళ్లిళ్లు కావడంతో 26 మందిని అదనంగా ఎంపిక చేశారు. ఓ వ్యక్తికి రెండు ఇళ్లు కేటాయించారని, 29 మందిని ఆధార్, ఇతర వివరాలు పరిశీలించకుండానే ఎంపిక చేశారని పేర్కొన్నారు.

అన్నీ ఉల్లంఘనలే!

- మెట్రో నిర్మాణ సంస్థకు రూ.227.19 కోట్ల అనుచిత లబ్ధి
- నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక చార్జీలు.. వెల్లడించిన కాగ్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోరైలును కాగ్ కడిగిపారేసింది. మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోని డొల్లతనాన్ని బయటపెట్టింది. 2020 నవంబర్ వరకు మెట్రో ప్రాజెక్టుపై కాగ్ ఆడిట్ నిర్వహించింది. కారిడార్ల ఖరారు, భూసేకరణలో జాప్యం ఫలితంగా ప్రాజెక్టు వ్యయ పెరిగినట్లు పేర్కొంది. నిర్మాణ సంస్థ రూ.227.19 కోట్లు అనుచిత లబ్ధి పొందినట్లు గుర్తించామని కాగ్ వెల్లడించింది. కేంద్ర మెట్రో చట్టాలకు అనుగుణంగా ఒప్పంద ప్రక్రియ జరపలేదని, రాయితీ ఒప్పందంలోని నిర్దిష్టమైన నిబంధనలను నిర్లక్ష్యం చేస్తూ అధిక చార్జీలను నిర్ణయించారని పేర్కొంది.

కాగ్ గుర్తించిన కొన్ని ముఖ్య అంశాలు

- కారిడార్-3లోని నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు డీపీఆర్ సరిగ్గా నిర్ధారణ చేయని కారణంగా అంచనా వ్యయం రూ.1,232 కోట్లకు పెరిగింది.
- కారిడార్-1లోని మియాపూర్ డిపో కోసం 40 హెక్టార్ల ప్రభుత్వ భూమి కేటాయించగా, పలువురు కోర్టును ఆశ్రయించడంతో భూసేకరణ జాప్యమైందని ప్రభుత్వం చెప్పడం అసమర్థతే.
- కారిడార్-2లోని పుత్లీబౌలి వాణిజ్య సముదాయాన్ని వినియోగించుకోలేదు.
- ఫలక్‌నుమా మార్గం పూర్తికాకపోవడంతో ప్రతికూల ప్రభావం పడింది.
- అవాస్తవ లక్ష్యాలు పెట్టుకుని రాయితీ ఒప్పందాన్ని ఏర్పాటు చేశారు. ఒప్పందానికి విరుద్ధంగా విస్తీర్ణం తగ్గించి స్టేషన్లు నిర్మించిన కారణంగా ఆ సంస్థకు రూ.227.19 కోట్ల లబ్ధి చేకూరింది.
- మెట్రోస్టేషన్లలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయలేదు. పార్కింగ్ కోసం 25 ప్రాంతాల్లో 57 ఎకరాల భూమిని నిర్మాణసంస్థకు అప్పగించారు. కేవలం 11 ప్రాంతాల్లో 33 ఎకరాల్లో మాత్రమే పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- ప్రయాణ చార్జీలు అధికంగా నిర్ణయించారు. 2 కిలోమీటర్లకు రూ.3 చార్జీ ఒప్పందం చేసుకోగా, రూ.10 వసూలు చేస్తున్నారు. రూ.40తో ఒకరోజులో ఎన్నిసార్లయినా ప్రయాణించవచ్చని ఒప్పందంలో పేర్కొనగా అమలు కావడం లేదు. అధిక చార్జీలతో 2017 నవంబర్-2020 మార్చి మధ్యలో రూ.213.77 కోట్లు అధికంగా వసూలు చేశారు.
- వాణిజ్య సముదాయాల సబ్‌లీజులో అవకతవకలు జరిగాయి.
- ఉప్పల్ కాస్టింగ్‌యార్డ్‌కు తక్కువ అద్దెను నిర్ణయించారు. బకాయిలను వసూలు చేయడానికి రాయితీ ఒప్పంద షరతులను ప్రభుత్వం అమలు చేయాలి.



మీడియా సమావేశంలో జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్, డీసీపీ కవిత

రోజుకు రూ. 2 కోట్లు

ట్రై కమిషనరేట్ల పరిధిలో దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు

- మోసపోతున్న వారిలో యువత, ఉద్యోగులే ఎక్కువ
- గోల్డెన్ అవర్‌లో 1930కు ఫోన్‌చేస్తే అడ్డుకోవచ్చు
- మీడియా సమావేశంలో సిటీ క్రైమ్స్ జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్



- వ్యాపారం చేసి తండ్రి అప్పులపాయ్యాడు. అప్పులు తీర్చకుండా ఆస్తిపాస్తులు అమ్మి రూ. 3 కోట్లు కుమార్తె ఖాతాలో జమచేసి కనిపించకుండా పోయాడు. తండ్రికి సహాయపడాలని నిర్ణయించుకున్న కుమార్తె ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి డబ్బంతా ట్రేడింగ్‌లో పెట్టింది. ప్రారంభంలో అధిక లాభాలు వచ్చినట్లు చూపించిన సైబర్ నేరగాళ్లు ఆ తర్వాత మొత్తం దోచేశారు. కుమార్తె భవిష్యత్ కోసం ఆస్తిపాస్తులు అమ్మేసి రూ. కోట్లు ఆమె ఖాతాలో వేసి తండ్రి ఇల్లు వదిలిపోతే.. ఇంటి నుంచి పారిపోయిన తండ్రిని ఆదుకుందామనే కోరికతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బంతా పెట్టి సైబర్ నేరగాళ్లకు అప్పగించింది కుమార్తె. దాంతో ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది.

4

- ఒక కంపెనీ మెయిల్ ఐడీని హ్యాక్ చేసి, బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకున్న సైబర్ నేరగాళ్లు రూ. 1.10 కోట్లు కొల్లగొట్టారు. ఆలస్యంగా గుర్తించిన కంపెనీ డైరెక్టర్లు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు... ఇలా ట్రై కమిషనరేట్ పరిధిలో రోజుకు సుమారు రూ. 2 కోట్లను సైబర్ నేరగాళ్లు కొట్టేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు షెడ్యూల్

- 20 నుంచి నామినేషన్ల స్వీకరణ
- మార్చి 7వ తేదీన పోలింగ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. గురువారం షెడ్యూల్ విడుదలైంది. 15 మంది సభ్యుల ఎన్నిక కోసం నేడు ప్రకటన వెలువడనుంది. 20 నుంచి 27 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని మూడో అంతస్తులో అదనపు కమిషనర్ (ఎన్నికలు) కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్లు వేసిన వారి వివరాలను 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ప్రకటిస్తారు. 28వ తేదీన ఉదయం 11 నుంచి నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అనంతరం అర్హులైన వారి నామినేషన్ల జాబితా విడుదల చేస్తారు. మార్చి 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశముంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల అనంతరం పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. 7వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి లెక్కింపు మొదలు కానుంది. అనంతరం ఫలితాలు వెల్లడి



జీహెచ్ఎంసీ నుంచి ఔట్

- తప్పుకున్న హౌసింగ్ ఓఎస్‌డీ
- త్వరలో మరో అదనపు కమిషనర్
- సేవలు పొడిగించొద్దని సర్కారు సర్క్యులర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసి విధుల్లో కొనసాగుతున్న జీహెచ్ఎంసీలోని పలువురు అధికారులు తప్పుకుంటున్నారు. హౌసింగ్ ఓఎస్‌డీ సురేష్‌కుమార్ ఇటీవల రాజీనామా చేశారు. ప్రభుత్వం ఆమోదించడంతో తాజాగా చీఫ్ ఇంజనీర్ దేవానంద్‌కు బాధ్యతలు అప్పగించారు. మరో అదనపు కమిషనర్ జయరాజ్ కెనడి కూడా రాజీనామా చేశారని తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో రెండు, మూడు రోజుల అనంతరం ఆయన విధుల నుంచి తప్పుకోనున్నారు. జీహెచ్ఎంసీలో మొత్తం 43 మంది అధికారులు/ఉద్యోగులు విరమణ చేసినా, వివిధ విభాగాల్లో కొనసాగుతున్నారు. వారి వివరాలతో కొన్నాళ్ల క్రితం సర్కారుకు కమిషనర్ నివేదిక పంపారు. అనంతరం వారి సేవలను పొడిగించొద్దని పేర్కొంటూ ప్రభుత్వం జీహెచ్ఎంసీకి సర్క్యులర్ పంపింది. దాదాపు అందరి పదవీకాలం ఈ ఏడాదితో ముగియనున్న నేపథ్యంలో తర్వాత సర్కారు అనుమతితో నిర్ణయాలుంటాయని పాలనా విభాగం అధికారొకరు తెలిపారు.

ప్రణాళికలు రూపొందించండి..

- ముందస్తు మాన్‌సూన్ ఏర్పాట్లపై దానకిషోర్ సమీక్ష



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో వరద ముంపు నివారణకు జోన్ల వారీగా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్ల వల్ల ప్రమాదం జరగకుండా చూడాలని, వాటిని తెరవకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలోపు నాలాల్లో పూడికతీత పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఎన్‌డీపీ రెండోదశ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఆర్ఎంపీ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఈఎన్‌సీని ఆదేశించారు.



సాహిత్య లోగిలి 4



ఫిబ్రవరి చివరి వారంలో ఎన్నికల కోడ్ : కిషన్‌రెడ్డి



బోయినపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ మొదటి వారంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఫిబ్రవరి చివరి వారంలో కోడ్ మొదలవుతుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులతో ఆయన ఇంపీరియల్ గార్డెన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌లాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రోత్సాహం వల్లే హైదరాబాద్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణలో ఫిబ్రవరి 20 నుంచి అయిదు యాత్రలు ప్రారంభమవుతున్నాయని, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలకాలని సూచించారు. మోహన్‌లాల్ యాదవ్ మాట్లాడుతూ అయోధ్యలో ప్రారంభమైన జైశ్రీరామ్ నినాదం అరబ్ దేశాలకు వెళ్లిందన్నారు. కొమురవెల్లి రైల్వేస్టేషన్ శంకుస్థాపనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యులు ఈటల రాజేందర్, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు, బీజేపీ కార్పొరేటర్లు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

భూ వివాదం.. లాయర్, ఎమ్మెల్యేపై కేసు

- రూ. ఓ సంఘాన్ని మోసం చేసి రూ. 7 కోట్లు స్వాహా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హైకోర్టు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ, అతనికి సహకరించి బెదిరింపులకు పాల్పడిన మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ గండిమైసమ్మ మండలం భౌరంపేటలో బుడగ జంగాల సంఘానికి (100 కుటుంబాలు) సుమారు 90 ఎకరాల భూమి ఉంది. చింతల్‌కు చెందిన చింతల మల్లయ్య 1982లో సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ భూములను కాపాడుతూ వస్తున్నారు. 1989లో ఆయన మృతి చెందడంతో కుమారుడు యాదగిరి సంఘాన్ని నడుపుతున్నారు. 2005లో కొందరు ప్రైవేట్ వ్యక్తులు కొంత మంది రైతులను రెచ్చగొట్టి ఆ భూమిని ఆక్రమించుకున్నారు. దాంతో భూ వివాదం న్యాయస్థానానికి చేరింది. సంఘం తరఫున కోర్టులో వాదించేందుకు సైదాబాద్ ప్రాంతానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణను ఏర్పాటు చేసుకున్నారు. ఫీజు కింద రూ. 30 లక్షలు చెల్లించారు. ఏళ్లు గడిచినా కేసు తేలడం లేదు. దాంతో సంఘం నాయకులు వెంకటరమణను కలిశారు. ప్రత్యర్థులు బలంగా ఉన్నారని, వారిని గెలవాలంటే జడ్జిలను

మిగతా 6వ పేజీలో..



డబ్ల్యూఐఎల్ ప్రోగ్రామ్ తీసుకొచ్చిన 'బిట్స్'

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్‌లను (డబ్ల్యూఐఎల్‌పీ) మరింత అభివృద్ధి చేసినట్లు బిట్స్ పిలాని డీన్ ప్రొఫెసర్ పీబీ వెంకటరామన్ తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో ఆటోమేటిక్ సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రియల్ మాన్యుఫాక్చరింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లెర్నింగ్.. ఇలా పలు అంశాలను అందిస్తున్నట్లు తెలిపారు. వారాంతంలో శని, ఆదివారాలు 8గంటల చొప్పున దాదాపు 16వారాలపాటు తరగతులుంటాయన్నారు. ఈ ప్రోగ్రామ్‌కు రెండు సెమిస్టర్లు ఉంటాయని వివరించారు.









సాహిత్య లోగిలి

హైదరాబాద్ పుస్తక మహోత్సవం సాహిత్య కార్యక్రమాలు, పుస్తకావిష్కరణ సభలతో గురువారం సందడిగా మారింది. పలువురు కవులు, రచయితలు సభల్లో పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం బుక్ ఫెయిర్‌ను సందర్శించారు. సోమవారంతో బుక్ ఫెయిర్ ముగియనుంది.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

టీవీఆర్ కృష్ణ పరిశోధనా గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్య సంస్థలు'ను ఆవిష్కరిస్తున్న నరహరి. చిత్రంలో డి. చంద్రశేఖర్ రెడ్డి, కె. శ్రీనివాస్ తదితరులు

'ఈ దేశం మనదే'..

ఐదు దశాబ్దాలుగా సమాజ, సాహిత్యాలపై కత్తి పద్మారావు చెరగని ముద్రవేశారని పద్మశ్రీ పురస్కార గ్రహీత కొలకలూరి ఇనాక్ కొనియాడారు. లోకాయుత ప్రచురణలు ఆధ్వర్యంలో గురువారం బుక్ ఫెయిర్‌లో కత్తి పద్మారావు రచించిన 'ఈ దేశం మనదే' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కవి జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకం దళిత తాత్విక చింతనకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సిటీకాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు కోయి కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పసునూరి రవీందర్, ఉర్దూ విశ్వవిద్యాలయం హిందీ శాఖ అధ్యక్షుడు ఆచార్య జీవీ రత్నాకర్, గడ్డం విజయరావు, కత్తుల కిషోర్ పాల్గొన్నారు.

'ఆధునిక తెలుగు సాహిత్య సంస్థలు' ఆవిష్కరణ

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అంచనా వేసేందుకు ఈ నేలపై సాహిత్యమే ప్రాణంగా కృషి చేసిన సాహిత్య సంస్థల గురించి తెలుసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని రవ్వా శ్రీహరి వేదికపై సీనియర్ జర్నలిస్టు టీవీఆర్ కృష్ణ పరిశోధనా గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్య సంస్థలు' పుస్తకాన్ని విశ్రాంత అధ్యాపకుడు మోత్కూరి నరహరి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శతాబ్ద కాలంలో తెలంగాణ నేలమీద వందలాది సంస్థలు సామాజిక వికాసానికి తోడ్పడ్డాయని పేర్కొన్నారు. ఎమెస్కో ఎడిటర్ డి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సాహితీ సంస్థలు కొన్ని రాజకీయ సిద్ధాంతాలతో, మరికొన్ని సాధారణ సంస్థలుగా, ఇంకొన్ని ఉద్యమ నేపథ్యంతో విశేష కృషి చేశాయని వివరించారు. 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాహిత్య చరిత్ర తెలుసుకోవాలంటే విజ్ఞాన చంద్రికా మండలి నుంచి విరసం వరకు, శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం మొదలు తెలంగాణ రచయితల సంఘం వరకు.. సాహిత్య సంస్థల చరిత్రను స్పృశించాలన్నారు. రచయిత ప్రయత్నాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు నాళేశ్వరం శంకరం, రాపోలు సుదర్శన్, జూలూరు గౌరీశంకర్, ప్రొఫెసర్ లలితాదేవి పాల్గొన్నారు.

విస్మృత సాహిత్య చరిత్రను వెలికితీయడమే లక్ష్యం



విస్మృత సాహిత్య చరిత్ర అంతా దళిత, మైనారిటీ, బీసీ వర్గాలదే అని, అందుకోసం కొత్త చరిత్ర రచనను తాను ఓ ఉద్యమంగా కొనసాగిస్తున్నట్లు చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. సాహిత్య విమర్శకు పరిశోధనే ప్రాణమని, పరిశోధనల లోతు తెలియకుంటే సమర్థవంతమైన విమర్శ బయటకు రాదని ఆయన అభిప్రాయపడ్డారు. బహుజనుల సాహిత్య చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రవ్వా శ్రీహరి వేదికపై సంగిశెట్టి శ్రీనివాస్‌తో ముఖాముఖి జరిగింది. ఈ సందర్భంగా ఆయన పరిశోధనా కృషి గురించి వివరించారు. తెలంగాణలో 1948కంటే ముందు ప్రచురితమైన 70 పత్రికల వివరాలను తాను సమగ్రంగా సేకరించినట్లు సంగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, వనపట్ల సుబ్బయ్య, పి. నారాయణ రెడ్డి, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ పాల్గొన్నారు.


'కొత్త తెలంగాణ శాసనాలు'

కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలంగాణ శాసనాలకు చిరునామాగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన రాసిన 'కొత్త తెలంగాణ శాసనాలు' పుస్తకాన్ని గురువారం బుక్ ఫెయిర్ వేదికగా చరిత్రకారుడు దామరాజు సూర్యకుమార్ ఆవిష్కరించారు. పర్యావరణవేత్త ఎం. వేదకుమార్ ఈమని శివనాగిరెడ్డి, వేనేపల్లి పాండురంగారావు, వేముగంటి మురళీకృష్ణ, జూలూరు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



'13' ఆవిష్కరణ

ప్రపంచాన్ని కుదిపేసిన థాయిలాండ్ బాలల ఫుట్‌బాల్ టీమ్ రెస్క్యూ ఆపరేషన్‌ను '13' పేరుతో రచయిత్రి స్వర్ణ కిలారి, దిలీప్ కొణతం కలిసి పుస్తకంగా తీసుకొచ్చారు. అన్వీక్షికి పబ్లికేషన్స్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని గురువారం బుక్‌ఫెయిర్‌లో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్, కుప్పిలి పద్మ, గొట్టిపాటి సుజాత, కొండవీటి సత్యవతి, సుధ గోపరాజు, వి. మల్లికార్జున్, సురేష్, మహి బెజవాడ, వెంకట్ శిద్ధారెడ్డి, బీపీ పడాల తదితరులు సామూహికంగా ఆవిష్కరించారు.





బీజేపీలోకి పీఎల్ శ్రీనివాస్



పి.ఎల్.శ్రీనివాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్

సికింద్రాబాద్/రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ హోదాల్లో పనిచేసిన పి.ఎల్.శ్రీనివాస్, ఆయన కుమార్తె, ప్రముఖ విద్యావేత్త పి.ఎల్.అలేఖ్య గురువారం బీజేపీలో చేరారు. సికింద్రాబాద్ మహబూబ్‌కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ కండువాలను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాంచందర్‌రావు, కార్పొరేటర్లు రాకేష్ జైస్వాల్, కొంతం దీపిక, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.శ్యామ్ సుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, పెద్ది రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల కార్యకర్త నల్లెల రాజయ్య కన్నుమూత



రాజయ్య(ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల కార్యకర్త, కవి, వరంగల్ జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపకుడు నల్లెల రాజయ్య(62) ఇక లేరు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. రాజయ్య స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా అబ్బాపూర్ గ్రామం. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 2020లో ఆయన పదవీ విరమణ చేశారు. శారీరక వైకల్యాన్ని లక్ష్యపెట్టకుండా సామాజిక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. నల్లెల రాజయ్య మరణం ప్రజాపోరాటాలకు తీరని లోటు అని పలు ప్రజాసంఘాల ప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. రాజయ్య అంత్యక్రియలు హన్మకొండ పద్మాక్షి గుట్టల సమీపంలో గురువారం సాయంత్రం ముగిసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

'కింగ్స్' షానవాజ్ ఖాన్ ఇంటిపై ఈడీ దాడి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమాలోని కింగ్స్ గ్రూప్ అధినేత షానవాజ్‌ఖాన్ ఇంటిపై ఈడీ అధికారులు మళ్లీ గురువారం దాడులు నిర్వహించారు. షానవాజ్ ఖాన్‌తోపాటు మొహమ్మద్ జుబైరుద్దీన్‌తో కింగ్స్ గ్రూప్ కంపెనీలకు చెందిన ఇతరవ్యక్తుల కార్యాలయాలపై దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. సోదాల్లో డిజిటల్ పరికరాలు, లెక్కల్లో చూపని రూ.76.50 లక్షల విలువైన నగదు, సుమారు రూ.150 లక్షల విలువైన విదేశీ కరెన్సీ, పలుపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అనేక కోట్ల విలువైన దేశీయ, అంతర్జాతీయ హవాలాకు సంబంధించిన నేరారోపణ పత్రాలు, బినామీ ఆస్తులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

రోజుకు రూ.2కోట్లు..

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో రోజుకు రూ.రెండు కోట్లను సైబర్ నేరగాళ్లు లూటీ చేస్తున్నారని హైదరాబాద్ సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు రూ.3 కోట్ల నుంచి 4 కోట్ల వరకు ఉంటుందన్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులు కల్పించాల్సిన అవగాహన కార్యక్రమాలపై గురువారం మీడియాతో చర్చించారు.

సైబర్ నేరాల బారినపడి మోసపోతున్న వారిలో యువత, సాఫ్ట్‌వేర్, రిటైర్డ్ ఉద్యోగులే ఉంటున్నారు. యూట్యూబ్ వీడియోలు లైక్ చేస్తే డబ్బులిస్తామంటే నమ్మి కొందరు.. పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో కొందరు.. మీ పేరుతో డ్రగ్స్ పార్శిల్ దొరికిందని భయపెట్టగానే ఇంకొందరు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. ఏటా రూ.వందల కోట్ల విలువైన మోసాలు జరుగుతున్నాయని జాయింట్ సీపీ ఆవేదన వ్యక్తం చేశారు.

గోల్డెన్ అవర్స్‌లో స్పందించాలి..

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకుంటే.. ఆ డబ్బు తిరిగి పొందడం అసాధ్యం అని రంగనాథ్ స్పష్టం చేశారు. డబ్బులు దోచేశారని అనుమానం వచ్చిన వెంటనే బాధితులు సాధ్యమైనంత తక్కువ సమయం(గోల్డెన్ అవర్)లో సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి రిపోర్టు చేయాలన్నారు. టోల్‌ఫ్రీ సిబ్బంది వెంటనే సైబర్ నేరగాడి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తారని తెలిపారు.

సినీ ప్రముఖులతో త్వరలో క్యాంపెయిన్..

సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు త్వరలోనే సినీ ప్రముఖులు, దర్శకులు, నటీ నటులతో పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీపీ కవిత, ఏసీపీ శివమారుతి, చాంద్‌పాషా ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్ట్రీట్‌లైట్స్ మరమ్మతులకు ప్రణాళికలు : రొనాల్డ్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాల నిర్వహణలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ ఏజెన్సీలను ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో గురువారం ఈఈఎస్ఎల్ ఏజెన్సీ అధికారులతో వీధిదీపాల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వీధిదీపాల మరమ్మతులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి దీపాల నిర్వహణలో ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే ఉపేక్షించమని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏజెన్సీ ప్రతినిధులు ఇంజనీర్ చీఫ్ జియాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో పెరగనున్న ఏఐ వినియోగం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వక్తలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ, చికిత్సల కోసం వైద్యరంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం నానాటికి పెరుగుతోందని ఏఐజీ ఆస్పత్రుల ఫౌండర్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బయాలజీ, బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో భాగంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో గురువారం ప్రారంభమైన బయో అన్వేషణ 2024 సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. వైద్యరంగంలో ఏఐ వినియోగం కారణంగా రానున్న ఐదేళ్లలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజేరావు, హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ హెడ్ ప్రొఫెసర్ జేఎస్ఎస్ ప్రకాష్‌తోపాటు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో 'యాక్ట్' క్లినిక్


'యాక్ట్' క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పూర్ణ కుర్కురే తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధిని జయించిన సర్వైవర్స్ మున్ముందు ఇబ్బందులు ఎదుర్కోకుండా జీవితాన్ని సాఫీగా గడపడానికి యాక్ట్ (ఆఫ్టర్ కాంప్లిషన్ ఆఫ్ థెరపీ) క్లినిక్‌ను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇంటర్నేషనల్ చైల్డ్ హుడ్ కేన్సర్ డే సందర్భంగా గురువారం ఇండియన్ కేన్సర్ సొసైటీ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పూర్ణ కుర్కురే ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యరంగంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం కారణంగా ఇప్పుడు కేన్సర్‌ను జయించిన వారి సంఖ్య పెరుగుతున్నదన్నారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కె.కృష్ణయ్య మాట్లాడుతూ చికిత్స పూర్తి అయిన తర్వాత సాధారణ జీవనాన్ని సాగించడానికి అవసరమైన సలహాలు, సూచనలు, ఇతరత్రా ఇబ్బందులను దూరం చేయడానికి ఈ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు ఎంవీటీ కృష్ణమోహన్, డాక్టర్ సెంథిల్ రాజప్ప, కల్పనా రఘునాథ్, వీరేంద్ర పాటిల్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో..


సెమినార్‌లో పాల్గొన్న వైద్యులు

రాయదుర్గం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ ఇమ్యూనో థెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా కాంటినెంటల్ ఆస్పత్రి పనిచేస్తుందని మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ ఏవీఎస్ సురేష్ తెలిపారు. గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో గురువారం ఇమ్యూనో ఆంకాలజీలో అడ్వాన్స్ ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మసాచ్‌సెట్స్ జనరల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ క్లినికల్ డైరెక్టర్, హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో ప్రొఫెసర్ డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ మాట్లాడుతూ మిలనామ చికిత్స గురించి వివరించారు. ఈ సెమినార్‌లో ఇమ్యూనో థెరపీలో, క్లినికల్ డెవలప్‌మెంట్‌లో గుర్తింపు పొందిన డాక్టర్ రమీఇబ్రహీం, సీనియర్ అంకాలజిస్టు డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ గురు ఎన్ రెడ్డి విశిష్ట పాల్గొన్నారు.

చిన్నారులపై లైంగిక వేధింపుల చిత్రాలు...

- సోషల్ మీడియాలో వైరల్ చేసిన యువకుడి అరెస్ట్


నిందితుడు జెమ్‌షెడ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై లైంగికదాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఇతర నిషేధిత సమాచారాన్ని ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వ్యక్తిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సిటీ క్రైమ్స్ అండ్ సిట్ జాయింట్ సీపీ ఏవీ.రంగనాథ్ వివరాలు వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఎస్‌కె.జమ్‌షెడ్ చిన్నారులపై లైంగిక దాడులకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నట్లు సీఐడీ పోలీసులు గుర్తించారని తెలిపారు. తన పర్యవేక్షణలో డీసీపీ కవిత, ఏసీపీ శివమారుతి, ఇన్‌స్పెక్టర్ నరేష్ బృందం సాంకేతిక ఆధారాలు సేకరించి నిందితుడ్ని గుర్తించినట్లు తెలిపారు. పోలీస్ బృందం పశ్చిమబెంగాల్‌కు వెళ్లి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

10 శాతం కమీషన్‌పై..
సైబర్ నేరగాళ్లకు బ్యాంకు అకౌంట్లు..

- చెన్నైకి చెందిన సైబర్ కిలేడీ ఆటకట్టించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 10 శాతం కమీషన్ తీసుకుంటూ.. సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చుతూ.. అమాయకులను మోసం చేస్తున్న సైబర్ కిలేడీని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైమ్ జాయింట్ సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ. 5.84లక్షలు పోగొట్టుకున్నాడు. దాంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ నరేష్ టీమ్.. టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించగా.. చెన్నైకి చెందిన ఒక బ్యాంకు ఖాతాలో బాధితుని డబ్బు జమయినట్లు గుర్తించారు. చెన్నైకి వెళ్లిన టీమ్ బ్యాంకు ఖాతా ఉన్న అడ్రస్‌లో ఆరా తీయగా.. సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన ఒక మహిళ తన పేరుతో బ్యాంకు ఖాతాలు తీసి 10 శాతం కమీషన్‌తో సైబర్ నేరగాళ్లకు అద్దెకు ఇస్తున్నట్లు తెలిసింది. టెలీగ్రామ్‌లో పరిచయం అయిన ఒక మహిళ ఆదేశాలతో ఇలాంటి మోసపూరితమైన పనులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించి ఆమెను అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి కటకటాల్లోకి నెట్టారు.

సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక సూత్రధారి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన సమతామూర్తి చిట్‌ఫండ్ కేసులో కీలక నిందితుడు సంస్థ అదనపు డైరెక్టర్ క్యాతం గణేష్(44)ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. ఇల్పుల శ్రీనివాస్, అతడి కుమారుడు రాకేష్ వర్మ సమతామూర్తి చిట్‌ఫండ్‌ను ప్రారంభించారు. గతంలో చిట్‌ఫండ్ మోసాలు చేసిన క్యాతం గణేష్ అదనపు డైరెక్టర్‌గా ఇందులో చేరాడు. మోసపూరిత వాగ్దానాలతో 110మంది నుంచి రూ. 1.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. వీరిపై పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు క్యాతం గణేష్‌ను గురువారం అరెస్ట్ చేశారు.

భూ వివాదం.. లాయర్, ఎమ్మెల్యేపై కేసు

(3వ పేజీ తరువాయి)

మ్యానేజ్ చేయాలని, అందుకు రూ. 10కోట్ల వరకు ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. దాంతో సంఘం సభ్యులంతా డబ్బులు పోగేసి రూ. 7 కోట్లు వెంకటరమణకు ఇచ్చారు. ఇక మనం కేసు గెలిచినట్లేనని, మీరు స్వీట్లు పంచుకోవడానికి సిద్ధంగా ఉండాలని బాధితులను నమ్మించాడు. కానీ, అడ్వొకేట్ ఏనాడూ కేసును సీరియస్‌గా తీసుకోలేదు. అనుమానంతో అడ్వొకేట్ తీరుపై ఆరా తీయగా, ప్రత్యర్థుల నుంచి రూ.25 కోట్లు తీసుకొని వారికి సహకరిస్తున్నట్లు బాధితులు గుర్తించారు. తమ డబ్బు తిరిగి ఇవ్వాలని అతడిపై ఒత్తిడి చేశారు. రూ. కోటి తిరిగి ఇచ్చిన వెంకటరమణ మిగిలిన డబ్బులు ఇవ్వకుండా వారిని వేధిస్తున్నాడు. మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను సంప్రదించి సంఘం నాయకుల నుంచి తనను బయటపడేయాలని మొరపెట్టుకున్నాడు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు సంఘం నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. దాంతో వేదుల వెంకటరమణ, ఎమ్మెల్యే బలాల నుంచి తమ సంఘానికి, తమ కుటుంబాలకు ప్రాణహాని ఉందని బాధితులు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు న్యాయవాది, మలక్‌పేట ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.


జల్‌పల్లి సబితా ఇంద్రారెడ్డి కాలనీలో పూజలో బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి


మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో పూజలో కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్

ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

పహాడిషరీఫ్ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా గురువారం జల్‌పల్లి సబితా ఇంద్రారెడ్డి నగర్‌లో ఆయన చిత్రపటానికి బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి సందర్భంగా గురువారం మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ యాతం పవన్ కుమార్‌యాదవ్ నివాళులర్పించారు.

రైళ్లల్లో పోగొట్టుకున్న 150 సెల్‌ఫోన్ల స్వాధీనం

- సీఈఐఆర్ పోర్టర్‌లో రిజిస్టర్ చేసుకోండి
- రైళ్లలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి తక్కువ ధరలకు వస్తుందని కొనకండి
- బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసిన రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, రైల్వే ఎస్పీ సలీమా


సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, రైల్వే ఎస్పీ సలీమా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ పరిధిలోని జోన్ పరిధిలో రైళ్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న 150 సెల్‌ఫోన్లను రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, రైల్వే ఎస్పీ సలీమా బాధితులకు అందజేశారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని కాజిపేట్, నాంపల్లి, కాచిగూడ రైళ్లలో ప్రయాణిస్తున్న ప్రయాణికుల సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడం, చోరీలకు గురి కావడంపై బాధితులు ఆయా జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తాము సీఈఐఆర్ పోర్టర్‌లో రిజిస్టర్ చేయించి తద్వార సెల్‌ఫోన్లు ఎవరెవరు ఎత్తుకెళ్లారు, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు ఎవరు ఉపయోగిస్తున్నారు, ఇలా వివిధ కోణంలో దర్యాప్తు ప్రారంభించామన్నారు. కేవలం నెల రోజుల్లోనే 150 సెల్‌ఫోన్లను వివిధ రాష్ట్రాలతో పాటు సికింద్రాబాద్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసుకున్నామన్నారు. మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, కాచిగూడ సీఐ ఎల్లప్ప, ఐటీ ప్రత్యేక టీం ఎస్ఐ కుమార్, ఎస్ఐ మాజీద్ పాల్గొన్నారు.

రైళ్లల్లో జాగ్రత్తగా ఉండాలి : రైల్వే డీజీపీ

రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మీ వద్దకు వచ్చి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చామని అందుకు ఊరికి వెళ్లేందుకు రైలు చార్జీలు లేవని నమ్మబలుకుతూ తన ఫోన్ వెయ్యి రూపాయలకు విక్రయిస్తానంటూ చాలా మంది నమ్మబలుకుతున్నారన్నారు. అయితే ఈ సెల్‌ఫోన్లు దొంగతనం చేసిన ఫోన్లని గుర్తు చేశారు. అయ్యో పాపం అని మీ వద్ద ఉన్న డబ్బుతో ఇలాంటి ఫోన్‌లను కొనడం వంటివి చేయకూడదని, నమ్మించిమోసం చేస్తారన్నారు. ఒక వేళ మీరు కొనుగోలు చేసిన ఫోన్ వినియోగిస్తే రైల్వే పోలీసులు మీకు ఫోన్ చేస్తారని మీరు కొన్నది దొంగ ఫోన్‌నని చెబుతూ ఆ ఫోన్ తెచ్చిస్తే సరిపోతుంది లేదంటే కేసు నమోదు చేస్తామని సూచనలు ఇస్తూ ఇలా కేరళ-5, ఉత్తరప్రదేశ్-4, మహారాష్ట్ర -13, కర్నాటక -11, మధ్యప్రదేశ్ -8, బీహార్-6, తమిళనాడు -7, తో పాటు ఏపీ-38, తెలంగాణ -58 సెల్‌ఫోన్లు రైళ్లలో దొంగలించబడ్డాయని, వీటిని మర్యాదపూర్వకంగా వ్యవహరించి 150 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కానిస్టేబుళ్లకు నగదు రివార్డులు

చాకచక్యంగా బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీలో మంచి నైపుణ్యం ద్వారా కేసును ఛేదించిన సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, ఖాజీపేట్ రైల్వే కానిస్టేబుళ్లకు రైల్వే డీజీపీ మహేష్ భగవత్ చేతుల మీదుగా నగదు రివార్డులను అందజేశారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు వెళ్లి సెల్‌ఫోన్లను రికవరీ చేసిన కానిస్టేబుళ్లను డీజీపీ, ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాలి

రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో మీ సెల్‌పోయిందని తెలిస్తే వెంటనే సీఈఐఆర్ పోర్టర్‌లో వెంటనే నమోదు చేసుకోవాలి. లేదంటే మీ సేవలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్ దొంగలించిన వ్యక్తి మరొకరికి విక్రయించడంతో ఆ ఫోన్ కొత్త సిమ్ వేసుకున్నట్లైతే వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్‌తో పాటు బాధితుడికి (ఆల్టర్నేట్ నెంబర్)కు మెస్సేజ్ వస్తుంది. వెంటనే ట్రేస్ చేసి పట్టుకుంటామని చెప్పారు. రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

\- కుమార్, రైల్వే ఐటీ నిపుణులు

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్

చేవెళ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని బీజేపీ సీనియర్ నేత, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మీరమణారెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు గురువారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో బీజేపీలో చేరారు. ఈమేరకు చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులతో కలిసి ఈటల సమక్షంలో బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకుముందు చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఈటల మాట్లాడుతూ.. ప్రపంచలోనే అతి శక్తివంతమైన నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. మరోమారు దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చేవిధంగా ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు గెలిచే విధంగా ప్రతీ కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడి పార్టీ బీజేపీ అని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/ZWqcEnhలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

గుంతలమయమైన రోడ్లు.. పొంగిపొర్లుతున్న డ్రైనేజీ


గౌలిపురా లలితాబాగ్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ

యాకుత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లపై డ్రైనేజీలు పొంగి పొర్లడంతో పాటు రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. ఇంజన్‌బౌలి మెయిన్ రోడ్డుకు అనుకొని ఉన్న షంషీర్‌గంజ్-ఆంధ్రాబ్యాంక్ రోడ్డుపై కొన్ని రోజుల నుంచి డ్రైనేజీలు పొంగి పొర్లడంతో రోడ్డు పూర్తిగా డ్రైనేజీ నీటితో నిండిపోయి రోడ్డుపై వెళ్లే వాహనాదారులకు తీవ్ర ఆటంకం ఏర్పాడుతోంది. అంతే కాకుండా ఈ రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలమయమైంది. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు.

లలితాబాగ్ ప్రధాన రహదారిపై మురుగునీరు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా లలితాబాగ్ ప్రధాన రహదారిపై నిత్యం మురుగునీరు పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కచ్చామోరీ పైపులైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురాతన పైపులైన్ కావడంతో మంచినీరు సైతం కలుషితం అవుతున్నది. ఇటీవల ఆ ప్రాంతంలో పర్యటించిన దక్షిణ మండలం జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయిందని స్థానికులు తెలిపారు.

శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకర్


సుధాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జి.సుధాకర్ నూతనంగా నియామితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ చేతుల మీదుగా జి.సుధాకర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన శివసేన సెంట్రల్ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే అభిజిత్ అడ్సుల్, శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శివాజీలకు జి.సుధాకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలోని సౌత్‌వెస్టు జోన్ డీసీపీగా నియమితులైన ఉదయ్‌కుమార్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు.

సందిగ్ధంలో బండ్లగూడ అవిశ్వాసం ఓటింగ్

నార్సింగ్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం సందిగ్ధంలో పడింది. 16 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి నోటీసు ఇవ్వడంతో శుక్రవారం 16వ తేదీన అవిశ్వాసంపై ఓటింగ్‌కు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ అవిశ్వాస తీర్మానంపై స్టే ఇవ్వాలని మేయర్ మహేందర్‌గౌడ్ హైకోర్టులో కేసు వేశారు. దీంతో కేసు విచారించిన హైకోర్టు స్టే ఇచ్చిందని మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ దరిమిలా ఈ విషయంపై బండ్లగూడ మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్రను వివరణ కోరగా.. కోర్టు ఆర్డరు వచ్చిన విషయం నిజమేనని, అయితే ఆ ఆర్డర్‌లో ఏముందో ఇంకా తెలియాల్సి ఉందని, తనకు ఇంత వరకు ఎలాంటి ఆదేశాలు కోర్టు నుంచిగానీ, జిల్లా కలెక్టర్ నుంచి గానీ అందలేదని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. 16న ఉదయం 11-00 గంటలకు సభ ఉన్నప్పటికీ కోర్టు ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనల మేరకు నడుచుకుంటామన్నారు. అయితే మున్సిపల్ చట్టం ప్రకారం నిబంధనలకు లోబడి కలెక్టర్ తేది ఇవ్వలేదని, ఇక్కడ నిబంధనలు పాటించలేదని, అందుకే మహేందర్‌గౌడ్ కోర్టుకు వెళ్లారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఒకవేళ ఈ విషయం పై కలెక్టర్ నిర్ణయం తీసుకుంటే అవిశ్వాసంపై ఓటింగ్‌కు మరోతేదీ ఇచ్చే అవకాశం ఉంది. ఈ దరిమిలా ఇదే తీర్పు 22వ తేదీన మణికొండ మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్‌పై కూడా అవిశ్వాస తీర్మాణానికి డేట్ ఇచ్చారు. మరీ అదికూడా జరుగుతుందా, వాయిదా పడుతుందా చూడాలి. ఇంకో పక్క బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ అవిశ్వాస తీర్మానంపై కోర్టు తీర్పు నేపథ్యంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 16 కార్పొరేటర్లలో కొంతమంది సీఎం రేవంత్‌రెడ్డిని కలిసే ప్రయత్నం చేశారు. గురువారం సాయంత్రం సీఎంను కలసి పార్టీలో చేరేందుకు వారంతా ఆసక్తి చూపారు. అపాయిట్‌మెంట్ దొరకకపోవడంతో వారంతా వెనుదిరిగారని సమాచారం.

టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ సభ్యులు ఆందోళన చెందొద్దు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ సొసైటీలో సభ్యత్వం లేని వ్యక్తులు సభ్యులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వారి పట్ల ఉద్యోగులు, గచ్చిబౌలి టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన పలువురు సభ్యులతో కలిసి అబిడ్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సొసైటీ నుంచి తొలగించిన వారితో పాటు సభ్యత్వమే లేని వ్యక్తులు కొత్తగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి సభ్యులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొంత మంది అధికారులతో కలిసి సొసైటీ ప్రతినిధుల పేర్లతో ఉన్న బోర్డులను తొలగించేలా చేసి తొలగించిన బోర్డులను ఫోటోలను వాట్సాప్‌లో పెట్టి సభ్యులను ఆందోళనకు గురి చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సొంత ఇంటి కోసం త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలవనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ డైరెక్టర్లు సభ్యులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం..

పాక్సో కేసు నమోదు.. యువకుడి అరెస్టు

యాకుత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని భవానినగర్ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. బాలికకు మాయ మాటలు చెప్పి, ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన భవానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ కథనం ప్రకారం.. 18 ఏళ్ల సయ్యద్ సాహిల్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ బాలికను పరిచయం చేసుకున్నాడు. దీంతో ఆ బాలికకు మాయమాటాలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. ముందుగా పోలీసులు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలికను లొంగదీసుకుని అత్యాచారానికి పాల్పడిన యువకుడిని గురువారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

దూద్‌బౌలిలో..

మదీన: పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ మైనర్‌పై అత్యాచారం జరిపిన వ్యక్తిపై కామాటిపురా పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ వై.కమల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దూద్‌బౌలికి చెందిన ఎ.నిరంజన్ కుమార్(39) మీసేవ కేంద్రం నిర్వాహకుడు. నగరానికి చెందిన బాలిక(17) అతడి మీసేవ కేంద్రానికి జిరాక్స్, ఇతర స్టేషనరీ కోసం వచ్చేది. ఈ క్రమంలో ఆమెతో మాటలు కలిపి లోబరుచుకున్నాడు. మీసేవ కేంద్రంలోనే బాలికపై అత్యాచారం చేసేవాడు. మూడు రోజుల క్రితం నిరంజన్ కుమార్‌తో బైక్‌పై వెళ్తుండడం బాలిక తల్లిదండ్రులు గమనించి ఇద్దరినీ నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపడింది. బాలిక తండ్రి కామాటిపురా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారించగా రెండేళ్ల నుంచి బాలికపై లైంగిక దాడి జరుగుతున్నట్లు వెల్లడైంది. నిందితునిపై పోక్సో 5,6 సెక్షన్‌లతోపాటు ఐపీసీ 376 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ఎ.నిరంజన్ కుమార్ ఓ జాతీయ పార్టీ దూద్‌బౌలి డివిజన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్యతో రెండేళ్లుగా విడిగా ఉంటున్నట్లు తెలిసింది.

బాలుడిపై లైంగికదాడి.. జీవిత కారాగార శిక్ష

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై లైంగిక దాడి చేసి, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తికి జీవిత కారాగార శిక్ష పడింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మైలార్‌దేవుపల్లి పోలీస్‌స్టేషన్ వట్టెపల్లి గుంతల్ షా బాబాదర్గా, నూర్‌కాలనీ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల దగ్గర నివాసం ఉండే సయ్యద్‌మహ్మద్‌ఇర్ఫాన్ అలియాస్ సోహెల్(35) 2015 డిసెంబర్ 23న బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆ బాలుడిని హత్య చేశాడు. ఈ కేసులో రాజేంద్రనగర్ స్పెషల్ పోక్సోకోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు వెల్లడించారు. బాలుడిపై లైంగిక దాడిచేసి హత్య చేసినందుకు సయ్యద్‌మహ్మద్ ఇర్ఫాన్ అలియాస్ సోహెల్‌కు జీవిత కారాగార శిక్షతోపాటు రూ.17వేల జరిమానా విధించారు.


పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో ఇష్టానుసారంగా పార్క్ చేసిన వాహనాలు

రోడ్డు మీద వాహనాల అక్రమ పార్కింగ్

- పట్టించుకోని పోలీసులు

యాకుత్‌పుర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో నెలల తరబడి కార్లు, బైక్‌లను రోడ్లపై పార్క్ చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయం. అలియాబాద్ పూల్‌బాగ్ ప్లే గ్రౌండ్ వద్ద ఒక బైక్, సమీపంలోని వేంకటేశ్వర దేవాలయం పక్కన ఉన్న రోడ్డుపై రెండు కార్లు, లాల్‌దర్వాజా కల్లుకంపౌండ్ దగ్గరలోని ఖాళీ స్థలంలో కారును పార్క్ చేశారు. ఆ వాహనాలకు సంబంధించిన వ్యక్తులు కూడా పట్టించుకోకపోవడంతో అవి తుప్పు పట్టాయి. ఛత్రినాకా, షాలిబండా, ఫలక్‌నుమాతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి రోడ్లపై కొంతకాలంగా పార్క్ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుని రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.